

కేసముద్రం స్టేషన్‌లో పారిశుధ్య పనులు చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

వేతన వేతలు

గ్రామపంచాయతీ సిబ్బందికి 8 నుంచి 18 నెలలుగా రాని జీతాలు

- జిల్లాలో నిధులు లేక జీపీలు వెలవెల
- బిల్లులు సమర్పించినా ఖజానా నుంచి రాని డబ్బులు
- ఆర్థిక ఇబ్బందుల్లో 1,665 మంది కార్మికులు

కేసముద్రం, జూన్ 19 : గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. జీపీ కార్మికులు జీతాల కోసం నెలల తరబడి నిరీక్షిస్తున్నారు. నెల నెలా చేతికి డబ్బులు రాకపోవడంతో వారికి కుటుంబ పోషణ భారంగా మారింది. గ్రామ పరిపాలనలో అత్యంత కీలకమైన గ్రామపంచాయతీ వ్యవస్థలో పనిచేసే సిబ్బందికి 18నెలలుగా వేతనాలు అందడం లేదు. మహబూబాబాద్ జిల్లాలోని 461 గ్రామ పంచాయతీల్లో 1,665 మంది గ్రామపంచాయతీ కార్మికులు జీతాలు లేక అల్లాడిపోతు న్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మల్టీవర్కర్స్ విధానం తీసుకువచ్చి గ్రామపంచాయతీల్లో నెలకు రూ.9,500 వేతనంతో కార్మికులను నియమిం చుకున్నారు.

ఈ విదానంలో గ్రామపంచాయతీల్లో స్వీపర్, పంపు ఆపరేటర్, బిల్‌కలెక్టర్, కారోబార్, ఎలక్ట్రీషియన్, నాన్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్)లను భర్తీ చేశారు. వీరంతా తమకు కేటాయించిన విధులను ఆయా గ్రామాల్లో ప్రతీ రోజు నిర్వహిస్తున్నారు. ఈ సిబ్బంది అంతా ప్రజలకు కనీస అవసరాలైన నీరు, విద్యుత్, పారిశుధ్యం పనులను నిర్వహించే వారే. వీరు ఒక్కరోజు పనిబంద్ చేసినా గ్రామాలు చెత్తాచెదారంతో నిండి కంపుకొడుతాయి. తాగునీరులేక జనం అల్లాడిపోతారు. అత్యవసర సేవల్లాంటి కీలకమైన విధులు నిర్వహించే వారికి ఇచ్చేదే నెలకు రూ.9,500 మాత్రం నామమాత్రపు వేతనమే. అది కూడా సకాలంలో చెల్లించకుండా జాప్యం జరుగుతోంది. మరోవైపు గ్రామపం చాయతీల్లో నిధుల్లేక ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. భవన నిర్మాణ అనుమతులు, వ్యాపార లైసెన్సుల జారీ కోసం దరఖాస్తుదారులు చెల్లించే రుసుం ఆయా గ్రామపంచాయతీ ఖాతాకు కాకుండా నేరుగా ప్రభుత్వానికి జమ అవుతున్నాయి. దీంతో చిన్న జీపీలేకాదు మేజర్ గ్రామపంచాయతీల్లో నూ పారిశుధ్య పనుల్లో వినియోగించే ట్రాక్టర్లకు డీజిల్ పోయించేందుకు డబ్బులు లేకపోవడం గమనార్హం.

461 గ్రామపంచాయతీల్లో పెండింగ్..

జిల్లాల్లోని 461 గ్రామపంచాయతీల్లో వివిధ రకాల పనులు చేస్తున్న 1,665 మంది జీపీ కార్మికులకు 8 నుంచి 18 నెలలుగా వేతనాలు బకాయిలు ఉన్నాయి. గ్రామపంచాయతీ స్థాయినిబట్టి కొన్ని జీపీల్లో నిధులు లేక ఏడాదిన్నర కాలంగా జీతం ఇవ్వనివి కూడా ఉండడం గమనార్హం. గ్రామపంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ నెల 15వ ఆర్థిక సంఘం (ఎఫ్ఎఫ్‌సీ), రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) నిధులు జమ కావాల్సి ఉంది. ఇందులో ఎస్ఎఫ్‌సీ నిధులు రాక రెండు సంవత్సరాలు అవుతుండగా ఎఫ్ఎఫ్‌సీ ఐదు నెలలుగా గ్రామపంచాయతీలకు జమ కాకుండా నిలిచిపోయాయి. ఈ నిధులతోపాటు సాధారణ నిధులు ఏవి అందుబాటులో ఉంటే వాటిలోంచి గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలు ఇవ్వాల్సిఉంటుంది. మేజర్ గ్రామపంచాయతీలకు ఇంటి పన్నులు, ఇతర పనుల రూపంలో సాధారణ నిధులు సమకూరుతాయి. అందులోంచి 30 శాతం మించకుండా వేతనాలకు వెచ్చించే అవకాశం ఉంది. అయినప్పటికీ జిల్లాలోని మేజర్ గ్రామపంచాయతీల్లో సాధారణ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేయడంతో ఏడాది క్రితమే ఖాళీ అయ్యాయి. కొన్ని మేజర్ జీపీల్లో మాత్రం నాలుగైదు నెలల జీతాల బిల్లులను ఖజానా శాఖకు సమర్పించినప్పటికీ ప్రభుత్వం నుంచి నిధులు రాక నిలిచిపోయాయి. ఇక చిన్నజీపీల పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. అరకొర ఇంటి పన్నులు, ఇతర ఆదాయ వనరులేమీ లేకపోవడంతో సాధారణ నిధులు లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాక సిబ్బంది వేతనాలతో పాటు జీపీ నిర్వహణను కూడా భారంగా నడిపిస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో సిబ్బంది..

మహబూబాబాద్ జిల్లాలోని గ్రామపంచాయతీల్లో పనిచేసే సిబ్బంది ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇచ్చే అరకొర వేతనమైనా సకాలంలో ఇవ్వకుండా 8 నుంచి 18 నెలలుగా ఇవ్వకపోవడంతో డబ్బులు లేక కుటుంబ పోషణభారంగా మారింది. జీపీ సిబ్బందిలో కొంతమంది మధ్యతరగతి, అత్యధిక మంది నిరుపేద వర్గాలకు చెందిన వారే ఉన్నారు. వీరంతా కేవలం గ్రామపంచాయతీ నుంచి వచ్చే వేతనాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. నిత్యం పారిశుధ్య పనులు, నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ పనులను మాత్రం నెలల తరబడి వేతనాలు రాకున్నా చేస్తున్నారు. వేతనాలు చెల్లించాలని పలుమార్లు మండల పరిషత్ కార్యాలయాల ఎదుట ధర్నాలు సైతం చేశారు. కుటుంబ పోషణ కోసం అప్పులు చేసి పూటగడుపుతున్న దయనీయ పరిస్థితిలో జీపీ కార్మికుల కుటుంబాలు ఉన్నాయి. నిత్యం గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్మికులకు వేతనాలివ్వకపోవడంపట్ల పలువురి నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసవేతన చట్టం అమలు చేసి నెలకు రూ.25 వేల వేతనాన్ని ప్రభుత్వ ఖజానా నుంచి నేరుగా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించి తమ ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని గ్రామపంచాయతీ కార్మికులు వేడుకుంటున్నారు.

ప్రభుత్వం నేరుగా వేతనం చెల్లించాలి

బండ్ల అప్పిరెడ్డి, జీపీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు జీపీ నిధులతో సంబంధం లేకుండా రాష్ట్రప్రభుత్వ ఖజానా నుంచి వేతనాలు ఇవ్వాలి. జీపీల్లో నిధులు లేకపోవడంతో నెలల తరబడి కార్మికులు వేతనాలు లేక అల్లాడిపోతున్నారు. కనీస వేతన చట్టం అమలు చేసి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పోస్టులను శాశ్వతం చేయాలి.

వేతనాలు వెంటనే చెల్లించాలి

జాటోత్ మంగీలాల్, జీపీ కార్మికుల సంఘం కేసముద్రం మండల అధ్యక్షుడు



కనీస వేతనం ఇవ్వకుండా మల్టీపర్పస్ వర్కర్ పేరుతో కొనసాగుతున్న జీపీ కార్మికులంతా 8 నుంచి 18 నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పేద వర్గాలకు చెందిన కార్మికులు ఆర్థికంగా కుటుంబం గడవడమే కష్టంగా కాలం వెల్లదీస్తున్నారు. ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి. లేనిపక్షంలో సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

- ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలి
- గడువు దాటిన సీడ్స్ అమ్మితే కేసులు నమోదు చేయాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంతో పాటు.. ఎరువుల కొరతలేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా వ్యవసాయ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు ఫర్టిలైజర్ షాపులను విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. విత్తనాల నాణ్యతను పరిశీలించడంతోపాటు విత్తన షాపుల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలచే తనిఖీలు చేపట్టి, ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని చెప్పారు. దుకాణదారులు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. విత్తన దుకాణాల్లో గడువు దాటిన బయో ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ ప్యాకెట్లను గుర్తించిషాపు యజమానులపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ఆరంభమైనందున ఫర్టిలైజర్ దుకాణాల్లో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువుల స్టాక్ పొజిషన్‌పై నివేదికలను మండల అధికారులు పంపాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఎరువుల కొరతలేకుండా చూసుకోవాలన్నారు ఏఈవోలు క్లస్టర్ల వారీగా విత్తనషాపులను తనిఖీచేసి నివేదికలను అందించాలన్నారు. ఈసమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు పాల్గొన్నారు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దు..

సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పనపై నిర్లక్ష్యం చేయవద్దని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ తనచాంబర్‌లో సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పనపై అధికారులతో చర్చించారు. వసతి గృహాల్లో ఈ విద్యాసంవత్సరం హాజరు శాతం అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతనుపాటించాలన్నారు. సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ ఎర్రయ్య, అధికారులు సుబ్బారావు, బలరాజు, నర్సింహస్వామి, శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి, రామారావు, విజయకుమారి, జయశ్రీ, అనిత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులు, ఐసీడీఎస్‌సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణీలు, పిల్లల హాజరును క్రమంతప్పకుండా నమోదు చేయాలని సూచించారు. ప్రతీనెల పోషకాహారం పంపిణీ చేయాలని చెప్పారు. పిల్లల ఎదుగుదల, ఎత్తు, బరువులను ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. శారీరక, మానసిక ఎదుగుదలలో లోపాలున్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పిల్లలు ఆటపాటలతో కూడిన విద్యను నేర్చుకునేలా ప్రోత్సాహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే కోడిగుడ్ల నాణ్యత ప్రమాణాలను పరిశీలించుకోవాలన్నారు. గర్భిణీల వివరాలు సమీప పీహెచ్‌సీ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని టీచర్లకు సూచించారు. డెలివరీ తర్వాత బాలింతలు పాటించాల్సిన ఆరోగ్యసూత్రాలు, ఆహారనియమాలు తెలియజేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేసి, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

ఊపందుకుంటున్న సాగు పనులు

- ఇప్పటికే 38,123 ఎకరాల్లో పత్తివితనాలు నాటిన రైతులు
- జిల్లాలో 45 శాతం అధికంగా వర్షపాతం నమోదు



కేసముద్రం మండలం కల్వలలో పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళా రైతులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్ 19 : అడపదడపా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులు ఊపందుకుంటున్నాయి. ఓవైపు పత్తి విత్తనాలు విత్తుతుండగా, మరోవైపు విత్తనాల కొనుగోళ్ల కోసం రైతులు విత్తన దుకాణాలకు పరుగెడుతున్నారు. జిల్లాలో పత్తి విత్తనాలు వేయడం జోరు పెరిగింది. దాంతో రైతులు బిజీబిజీగా వ్యవసాయ పనుల్లో మునిగిపోయారు. మహబూబాబాద్ జిల్లాలో 4,30,521 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనాలు వేసింది. పత్తి 84,070 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ భావిస్తుండగా ఇప్పటి వరకు జిల్లాలోని వివిధ మండలాల్లో 38,123 ఎకరాల్లో పత్తి సాగు చేశారు.

ఈసారి పత్తితో పాటు మిర్చి సాగు విస్తీర్ణం పెరగనుంది. జిల్లాలో బుధవారం వరకు 1,445.8 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 2,099.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అయితే జిల్లాలో 45 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. దాంతో వ్యవసాయ పనులు ఊపందుకుంటున్నాయి.

పలు మండలాల్లో వాన

మహబూబాబాద్ జిల్లాలో బుధవారం ఉదయం పలు మండలాల్లో జోరువాన కురిసింది. ఉదయం 5 నుంచి 7 గంటల వరకు భారీవర్షం కురియగా, ఆ తర్వాత గంటపాటు ముసురు అలుముకుంది. బయ్యారం, కేసముద్రం, మహబూబాబాద్, ఇనుగుర్తి మండలాల్లో భారీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో చిరుజల్లుల నుంచి ఓ మోస్తారు వర్షం కురిసింది. మంగళవారం వరకు తీవ్రమైన ఉష్ణోగ్రతలతో ఉక్కపోతకు గురైన ప్రజలు అల్లాడిపోయారు. ఈ వర్షం వాతావరణం కాస్త చల్లబడడంతో ఊరట నిచ్చింది. బయ్యారంలో 98.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, కేసముద్రంలో 75.3, మహబూబాబాద్‌లో 62.5, ఇనుగుర్తిలో 61.0, కొత్తగూడలో 2.0, గంగారంలో 16.9, గార్లలో 41.2, డోర్నకల్‌లో 14.5, కురవిలో 22.8, గూడూరులో 16.4, నెల్లికుదురులో 15.6, నర్సింహులపేటలో 35.5, చిన్నగూడూరులో 34.0, మరిపెడలో 6.5, దంతాలపల్లిలో 10.5, తొర్రూరులో 4.8, పెద్దవంగరలో 4.6, సీరోలులో 19.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 542.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, జిల్లాలో సగటున 30.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు

మానుకోట పట్టణ సీఐ దేవేందర్

విత్తనాలు ఎమ్మార్పీ ధరల కంటే అత్యధిక ధరలకు విక్రయిస్తే చర్యలు చేపడుతామని మహబూబాబాద్ పట్టణ సీఐ పెండ్యాల దేవేందర్, మండల వ్యవసాయాధికారి ఎన్.తిరుపతిరెడ్డి హెచ్చరించారు. మహబూబాబాద్ పట్టణంలోని పలు విత్తన దుకాణాలను బుధవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లోని పత్తి, మిర్చి విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. తయారు తేదీ, గడువుతేదీ, లాట్ నెంబర్, కంపెనీ పేర్లను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే షాపు లైసెన్స్‌లు రద్దు చేస్తామని తెలిపారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు.

మరమ్మతులను త్వరితగతిన చేపట్టాలి

- కొత్తగూడకు మరో సబ్‌స్టేషన్ మంజూరు చేస్తా
- ప్రజలకు నిరంతరం కరెంట్‌ను అందించాలి
- ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



కొత్తగూడలో సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న వరుణ్‌రెడ్డి

కేసముద్రం, జూన్ 19 : వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో ఏర్పడే ఆటంకాలకు త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. కేసముద్రం తహసీల్దార్ కార్యాలయం వెనుక నూతనంగా నిర్మించబోయే సబ్‌స్టేషన్ స్థలాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ఓవర్‌లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లు వాడకుండా చూడాలని, వంద శాతం ఆదాయాన్ని సేకరించాలని ఆదేశించారు. వర్షాల సమయంలో విద్యుత్ పునరుద్ధరణ త్వరితగతిన చేస్తున్నందుకు సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట ప్రాజెక్టు సీజీఎం రాజు చౌహాన్, ఎస్ఈ జె.నరేష్, డీఈలు పి.విజయ్, టి.అనిల్, డిప్యూటీ తహసీల్దార్ రాములు, ఏడీఈ శ్రీనివాసులు, ఏఈలు కె.రాజు, శశిధర్, సబ్ ఇంజనీర్ కరుణాకర్ ఉన్నారు.

- కొత్తగూడ : కొత్తగూడ మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్‌లో మొక్కను నాటి, విద్యుత్ సరఫరా, నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు.అటవీప్రాంతం కావడంవల్ల కొంత ఇబ్బంది ఉందని ఏఈ సురేష్ సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు మరో సబ్‌స్టేషన్‌ను మంజూరు చేస్తానని సీఎండీ తెలిపారు. బత్తులపల్లిలో గిరివికాస పథకంలో మంజూరైన విద్యుత్ పనులను పరిశీలించారు. గోపాలపురం, బత్తులపల్లిలో గ్రామస్తులతో మా ట్లాడి విద్యుత్ సమస్యలు, సరఫరాపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రాజెక్టు సీజీఎం రాజుచౌహాన్, ఎస్ఈ జనగాం నరేష్, డీఈలు పి.విజయ్, అనిల్, ఏఈ సురేష్, ఇబ్బంది ఉన్నారు.
- నెల్లికుదురు : ప్రజలకు నిరంతర విద్యుత్‌సేవలు అందించాలని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. నల్లగుట్టతండాలో విద్యుత్ మరమతులు, అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం నెల్లికుదురులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. విద్యుత్ సిబ్బంది పనితీరును, రికార్డులను పరిశీలించారు. ప్రజలకు నిరంతర విద్యుత్ సేవలు అందించాలన్నారు. భద్రతపరికరాలను వెంట తీసుకవెళ్లాలన్నారు. ప్రతీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా ఫీడర్లను త్వరగా సరి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో జీఎంరాజుచోహన్, ఎస్ఈ నరేష్, అనిల్‌కుమార్, డీఈలు మధుసుధన్, విజయ్ కుమార్ హరినా యక్, ఏఈ సింధు, భార్గవి పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

- జిల్లాలో 12 కేసుల నమోదు, 143 లీటర్ల సారాయి స్వాధీనం
- 1,930 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ వివరాలు వెల్లడి



సాలార్‌తండాలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించిన టౌన్ సీఐ దేవేందర్, సిబ్బంది

మహబూబాబాద్ టౌన్, జూన్19 : జిల్లా వ్యాప్తంగా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాలతో బుధవారం పోలీసులు ఏకకాలంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 18 పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 12కేసులు నమోదు చేసి, రూ.57,200 విలువ గల 143 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ సుధీర్‌రామ్ నాథ్‌కేకన్ వివరించారు. 1,930 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల

మిగతా 6వ పేజీలో..

కటకటాల్లోకి కామ ఖాకీ!

- మహిళా కానిస్టేబుల్‌పై అత్యాచారం కేసులో అరెస్టు
- కాళేశ్వరం ఎస్సై భవానిసేన్‌గౌడ్‌కు రిమాండ్
- ఉద్యోగంలో నుంచి డిస్మిస్?

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్19 : కామా తురాణం.. న సిగ్గు.. న లజ్జ.. అనే సామెత ఈ పోలీసుకు అతికినట్లుగా సరిపోతుంది. గౌరవ ప్రదమైన స్థానంలో ఉండి ప్రజలను రక్షించాల్సింది పోయి.. తనతో పనిచేసే తోటి ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడి కామాంధుడిగా మారిపోయాడు. అతగాడి కామలీలకు విసిగి వేసారిన బాధితురాలు.. ఎట్టకేలకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో బహిర్గతమైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సంచలనం రేకెత్తించిన కాళేశ్వరం ఎస్సై భవానిసేన్‌గౌడ్ వ్యవహార శైలి పోలీసు శాఖకే మచ్చ తెచ్చినట్లయింది.





కోర్టులో హాజరుపరుస్తున్న క్రమంలో లోనికి పరుగులు తీస్తున్న నిందితుడైన భవానిసేన్‌గౌడ్

మహిళా కానిస్టేబుల్‌పై అత్యాచారం

ఎస్సై భవానిసేన్‌గౌడ్ ఆ ఉమెన్ హెచ్‌పీసీని లైంగికంగా వేధింపులకు గురిచేశాడు. 20 రోజుల కిందట తనకు ఫోన్‌చేసి తన కాలు స్లిప్‌అయి జారిపడ్డానని, కాలికి గాయం అయిందని, తన గదికి రావాలని కోరాడు. దీంతో బాధితురాలు ఎస్సై గదికి వెళ్లగా లైంగికంగా ప్రలోభానికి గురిచేశాడు. ఆ వెంటనే అతడి పోకడను పసిగట్టిన బాధితురాలు.. ఎస్సైని తోసేసి తన గదిలోకి పరుగెత్తుకుంటూ వెళ్లింది. మళ్లీ ఈనెల 16వ తేదీన పాత కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో తాను నివాసముండే ఇంట్లో నిద్రిస్తున్న ఉమెన్ హెచ్‌పీసీని రాత్రి 1 గంటకు అదే భవనం 2వ అంతస్తులో ఉంటున్న ఎస్సై భవానిసేన్‌గౌడ్ కిటికీలోంచి ఆమె ఇంట్లోకి చొరబడి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె ఎస్సైని ప్రతిఘటించడంతో తన వద్ద ఉన్నగన్‌ను గురిపెట్టి బెదిరించి అత్యాచారానికి ఒడిగట్టాడు. అత్యాచారం విషయం బయటకు చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమెను బెదిరించాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు చేయడంతో విచారణలో అధికారులు నిజాలను నిగ్గు తేల్చారు.

సీఎం దృష్టికి..

కాళేశ్వరం ఎస్సై భవానిసేన్‌గౌడ్ లైంగిక వేధింపుల వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. వివిధ దినపత్రికలు, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆదికాస్తా సీఎం దృష్టికి వెళ్లింది. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకొని శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో జిల్లా పోలీసు యంత్రాంగం తీవ్రంగా పరిగణించి చర్యలకు ఉపక్రమించింది. బాధితురాలి ఫిర్యాదుతో జిల్లా పోలీస్‌బాస్ కిరణ్‌ఖరే సూచనతో భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు, కాటారం, మహదేవపూర్ సీఐల నేతృత్వంలో ఆ ఎస్సైని అదుపులోకి తీసుకొని విచారణ జరిపారు. వైద్య పరీక్షలు సైతం ఆస్పత్రిలో చేయించి అత్యాచారం నిజమేననే నిర్ధారణకు వచ్చి చర్యలు శ్రీకారం చుట్టారు. కాగా, ఇక్కడ జరిగిన ఉదంతంపై జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే.. మల్టీజోన్ ఐజీ ఏవీ రంగనాథ్‌కు

మిగతా 6వ పేజీలో..

రైతులకు కేంద్రం ఊరట

14 రకాల పంటలకు మద్దతు ధరల పెంపు

వరంగల్ వ్యవసాయం, జూన్ 19: మూడోసారి ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నరేంద్రమోదీ ప్రభుత్వం 14 రకాల పంటలకు మద్దతు ధరలను పెంచుతూ బుధవారం నిర్ణయం తీసుకుంది. కేంద్రం నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వారణాసిలో ప్రధానమంత్రి కిసాన్ సామ్మాన్ నిధి పథకం 17వ విడత డబ్బులు రూ.20వేల కోట్లను నరేంద్రమోదీ రైతుల ఖాతా ల్లో జమ చేశారు. ఆ మరుసటి రోజే రైతులకు మరో మంచి వార్తను చెప్పడం విశేషం.

పెరిగిన పంట ధర

పంట	2024-25	పెంచినది
వరి ధాన్యం	రూ.2,300	117
వరి(ఏ గ్రేడు)	రూ.2,320	117
జొన్న	రూ.3,371	91
మక్కజొన్న	రూ.2,225	135
సజ్జలు	రూ.2,625	125
రాగులు	రూ.4,290	444
కందుల	రూ.7,550	550
పెసర్లు	రూ.8,682	124
మినుములు	రూ.7,400	450
వేరుశనగ	రూ.6,783	406
సన్‌ఫ్లవర్	రూ.7,280	520
సోయా	రూ.4,892	292
నువ్వులు	రూ.9,267	632
ఒడిసెలు	రూ.8,717	983
పత్తి	రూ.7,521	501

కార్పెంటర్ యూనియన్‌కు సహకరిస్తాం..

కాళోజీ జంక్షన్, జూన్ 19 : కార్పెంటర్ యూనియన్‌కు అన్నివిధాలా సహకరిస్తామని జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. ఇటీవల నియమకమైన ఉమ్మడి జిల్లా కార్పెంటర్ యూనియన్ నూతన కార్యవర్గ నాయకులు బుధవారం హనుమకొండ సుబేదారిలోని కార్మికశాఖ కార్యాలయంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ రమేష్‌బాబును కలిసి గత కార్యవర్గాన్ని మార్చుతూ సర్వీస్ కాపీలో మార్పులు చేసి సర్టిఫైడ్ కాపీలు ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పెంటర్ యూనియన్ తరపున రమేష్‌బాబు జన్మదినం సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. డిప్యూటీ లేబర్ కమిషనర్‌ను కలిసిన వారిలో కార్పెంటర్ యూనియన్ కన్వీనర్ వీణవంక సదానందం, అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవో రమాదేవి నుంచి పదోన్నతి ఉత్తర్వులు అందుకుంటున్న ఉపాధ్యాయుడు

పదోన్నతుల ఆర్డర్లు అందుకున్న ఉపాధ్యాయులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 19: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు ఉత్వర్వులు అందుకున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని ఆయా మండలాల ఎంఈవోలు పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు బుధవారం ఉత్తర్వులు అందజేశారు. వరంగల్ జిల్లాలో అన్ని కేటగిరీల్లో కలిపి 434 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు సాధింగా, హనుమకొండ జిల్లాలో 454 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. అయితే వరంగల్ జిల్లాలో మాత్రం రోస్టర్ పాయింట్లలో తలెత్తిన సాంకేతిక కారణాలతో ప్రభుత్వ విభాగంలోని పీఈటీలు, లోకల్ బాడీలోని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలతో పాటు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు బుధవారం రాత్రి వరకు ఇంకా పూర్తి కాలేదు.

ఆర్టీసీ ఆర్ఎంగా విజయభాను బాధ్యతల స్వీకరణ

బాలసముద్రం, జూన్ 19: టీజీ ఎస్ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్‌గా డి. విజయభాను మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ చార్మినర్ డివిజన్ డిప్యూటీ రీజినల్ (ఆపరేషన్స్) మేనేజర్‌గా పనిచేసి పదోన్నతిపై వరంగల్ ఆర్ఎంగా వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎం విజయభానును డిప్యూటీ రీజినల్ మేనేజర్ కె.భానుకిరణ్, డిపో మేనేజర్‌లు ఆర్ఎంకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డీబార్

కేయూ క్యాంపస్, జూన్ 19: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య కేంద్రం డిగ్రీ కోర్సుల పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు ప్రాక్టీస్‌కు పాల్పడగా తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్ బుధవారం తెలిపారు. డీబారైన వారిలో హనుమకొండ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్స్ సైన్స్ కళాశాలలో ఇద్దరూ ఉన్నట్లు పేర్కొన్నారు. వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కేయూలో వినియోగదారుల అధ్యయన కేంద్రం

జాతీయ వినియోగదారుల సమావేశంలో డిమాండ్


వినతి పత్రం అందచేస్తున్న చక్రపాణి

హనుమకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ విశ్వవిద్యాలయంలో వినియోగదారుల అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఢిల్లీలో జరుగుతున్న వినియోగదారుల జాతీయ సమావేశాల్లో ప్రధానంగా చర్చకు వచ్చింది. కన్స్యూమర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం పక్షాన పాల్గొన్న జాతీయ వినియోగదారుల మండలి ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి ఈ అంశాన్ని లేవనెత్తారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో వినియోగదారుల అధ్యయన కేంద్రం లేకపోవడం లోటుగా ఉందన్నారు. వినియోగదారుల ఉద్యమం చురుకుగా సాగుతున్న వరంగల్‌లోని కేయూలో వినియోగదారుల హక్కుల రక్షణ, చైతన్యానికి అధ్యయన కేంద్రాన్ని తప్పక ఏర్పాటు చేయాలని కోరారు. ఈమేరకు ఒక తీర్మానాన్ని కూడా ఆయన ప్రవేశపెట్టారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యదర్శి నిధి ఖరేకు వినతి పత్రాన్ని కూడా సమర్పించారు. వినియోగదారుల జాతీయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్, క్యాట్కో చైర్మెన్ శంకర్ లాల్ చౌరసాయి, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పెండోట అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్ ఈ సందర్భంగా పాల్గొన్నారు. సమావేశాలకు సీసీఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అనంత్ శర్మ అధ్యక్షత వహించారు.

పంతుళ్ల పదోన్నతుల్లో గందరగోళం

● పదోన్నతులు చేపట్టినా 40 శాతం ఖాళీలే.. ● పోస్టులున్నా అప్‌గ్రేడ్ కాని పండితులు ● పదోన్నతులు రాక నైరాశ్యంలో కొంత మంది ఎస్జీటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 19: విద్యాశాఖలో నిర్వహిస్తున్న పంతుళ్ల పదోన్నతుల ప్రక్రియ గందరగోళంగా ముగియనుంది. పదోన్నతులు చేపడితే ఖాళీలు భర్తీఅయ్యి అర్హత ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతులు లభిస్తాయనే ఆశలు అడియాశలే అయ్యాయి. 25 ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న వారిలో కొంతమందికి ఈ సారి పదోన్నతుల ప్రక్రియ సైతం నిరాశే మిగిల్చింది. ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఒకటి కంటే ఎక్కువ పదోన్నతులు సాధించిన ఉపాధ్యాయులు ఒకే చోటుకు వెళుతుంటే.. మిగతా చోట్ల ఖాళీలు అలాగే ఉంటున్నాయి. దీంతో జిల్లాల్లో 40శాతం ఖాళీలు ఏర్పడుతున్నట్లు ఉపాధ్యాయులు వాపోతున్నారు. అర్హత సాధించినప్పటికీ కొంతమంది పండిట్లు ఉన్నతీకరణకు నోచుకోవడం లేదు. సీనియారిటీ జాబితా ప్రకారం ముందుగానే ఒకటి కంటే ఎక్కువ పదోన్నతుల ఆప్షన్లు ఎంపిక చేసుకోవడంతో కొంతమందికి పదోన్నతులకు అవకాశం లేకుండా పోయింది.

ఇదిలాఉండగా, వరంగల్ జిల్లాలో ఐదుగురు తెలుగు పండిట్లు ఉన్నతీకరణకు నోచుకోలేదు. హనుమకొండ జిల్లాలో 12 మంది తెలుగు పండిట్లు, 13మంది హిందీ పండిట్లు ఉన్నతీకరణకు నోచుకోలేదు. ఇక వరంగల్ జిల్లాలో మాత్రం రోస్టర్ పాయింట్లలో తలెత్తిన సాంకేతిక కారణాలతో ప్రభుత్వ విభాగంలోని పీఈటీలు, లోకల్ బాడీలోని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలతో పాటు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు బుధవారం రాత్రి వరకు ఇంకా పూర్తి కాలేదు. మొత్తంగా ఈ సారి పదోన్నతుల ప్రక్రియ సైతం గందరగోళంగానే ముగుస్తున్నట్లు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, వరంగల్‌జిల్లాలో అన్ని కేటగిరీలల్లో కలిపి మొత్తం 434 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు సాధించగా, హనుమకొండ జిల్లాలో 454 మంది ఉపాధ్యాయులు పదోన్నతి పొందారు.

40 శాతం ఖాళీలే..

పదోన్నతుల ప్రక్రియలో ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయులను స్కూల్ అసిస్టెంట్లుగాను, పండిట్లు, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా పదోన్నతులు కల్పిస్తుంటే ఈ ప్రక్రియలో సైతం 40 శాతం ఖాళీలు ఏర్పడనున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయులకు వారి అర్హతలను బట్టి రెండు, మూడు పదోన్నతులు వస్తున్నాయి. వారికి ఆ మేరకు ఉత్తర్వులు అందజేయడంతో వారు ఒకే ఒక పోస్టులో చేరనున్నారు. దీంతో మిగతా రెండు పోస్టులు ఖాళీలు ఏర్పడనున్నాయి. ఇలా ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు సాఫ్ట్‌వేర్‌లో ఏర్పాటు చేయకపోవడంతో మళ్లీ పదోన్నతుల ప్రక్రియ జరిగేంత వరకు ఆ పోస్టులు ఖాళీలుగానే ఉండనున్నాయి. ఈ రకంగా సుమారుగా 40 శాతం ఖాళీలు అలాగే ఉండనున్నాయి.

అప్‌గ్రేడ్ కాని కొంత మంది పండితులు

దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించలేదు అన్న చందంగా తయారయ్యింది రెండు జిల్లాల్లో పండితుల పరిస్థితి. జిల్లాల వారిగా కేడర్ స్ట్రెంత్ ప్రకారం పండితుల పోస్టులు అప్‌గ్రేడ్ అయినా అర్హత కలిగిన పండిట్లలో కొంతమందికి మాత్రం ఉన్నతీకరణ లేకుండా మొండిచేయే మిగిలింది. పోస్టులు అప్‌గ్రేడ్ అయినా కొంత మంది ఎల్పీలు మాత్రం అప్‌గ్రేడ్ కాలేదు.

వరంగల్ జిల్లాలో ఇలా...

వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ విభాగంలో 16 ఎల్పీ తెలుగు పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. 8 మంది ఉపాధ్యాయులు ఉండగా, అందులో 5గురు ఉపాధ్యాయులకు మాత్రమే ఉన్నతీకరణ పోస్టుల్లో అవకాశం దక్కింది. మరో ముగ్గురు ఉపాధ్యాయులకు అవకాశం దక్కలేదు. వీరికి రోస్టర్ పాయింట్ల ప్రకారం ఉన్నతీకరణ దక్కడం లేదని అధికారులు చెబుతుంటే అధికారుల పొరపాటు వల్లనే తమకు ఉన్నతీకరణ దక్కలేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

హనుమకొండ జిల్లాలో ఇలా...



హనుమకొండ జిల్లాలో పరిస్థితి మరోలా ఉంది. ఎల్పీ తెలుగులో మొత్తం 103 పోస్టులుం డగా, అందులో 90 పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. అయితే ఇందులో 90 మందికి మాత్రమే ఉన్నతీకరణ అవకాశం దక్కగా, మరో 12 మంది ఎల్పీ తెలుగు ఉపాధ్యాయులకు నిరాశే మిగిలింది. ఇక హిందీ పండిట్ల విషయంలోనూ ఇదే మాదిరిగా జరిగింది. 106 పోస్టులుండగా అందులో 94 మందికి ఉన్నతీకరణ అవకాశం దక్కగా మరో 12 మందికి ఉన్నతీకరణ అవకాశం దక్కలేదు.

వింత పరిస్థితి

పదోన్నతుల ప్రక్రియ విద్యాశాఖలో వింత పరిస్థితిని నెలకొల్పింది. ఎల్పీల ఉన్నతీకరణలో భాగంగా కొన్ని పాఠశాలల్లో పోస్టు ఉన్నతీకరణ అయ్యింది. అయితే అక్కడ పనిచేస్తున్న సదరు ఉపాధ్యాయులకు మాత్రం ఉన్నతీకరణ దక్కలేదు. దీంతో ఉన్నతీకరణ అర్హత పొందిన ఉపాధ్యాయులు అదే పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుంది. అక్కడే ఉన్నతీకరణ పొందని ఉపాధ్యాయులు సైతం పనిచేయాల్సి ఉంటుంది.

ఇవీ ఉదాహరణలు

వరంగల్ మండల పరిధిలోని కృష్ణకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న హిందీ పండిట్ పోస్టు అప్‌గ్రేడ్ అయ్యింది. ఆ పోస్టులో పనిచేస్తున్న హిందీ పండిట్‌కు మాత్రం అప్‌గ్రెడేషన్ దక్కలేదు. దీంతో అప్‌గ్రేడ్ అయిన ఎల్పీతో పాటు అక్కడ ప్రస్తుతం పనిచేస్తున్న ఎల్పీ సైతం పనిచేయాలి. కమలాపూర్ మండలంలోని మాదన్నపేట పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఎల్పీకి ఉన్నతీకరణ అవకాశం దక్కలేదు. కానీ పోస్టు మాత్రం ఉన్నతీకరణ అయ్యింది. దీంతో అక్కడ పనిచేస్తున్న ఎల్పీతో పాటు అప్‌గ్రేడ్ అయిన ఎల్పీ సైతం ఇక్కడే పనిచేయాల్సి ఉంది. అయితే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న చోట ఇద్దరు ఎల్పీలు పనిచేయడం గమనార్హం.

జిల్లాల వారిగా పదోన్నతులు ఇలా...

	కేటగిరి	ప్రభుత్వ	లోకల్‌బాడి
వరంగల్ జిల్లాలో...	పీఎస్‌హెచ్ఎం(ఎల్ఎఫ్ఎల్)	7	56
	ఎస్ఏ ఇంగ్లీష్	5	10
	ఎస్ఏ గణితం	1	20
	ఎస్ఏ తెలుగు	5	105
	ఎస్ఏ బయోసైన్స్	7	22
	ఎస్ఏ హిందీ	5	88
	ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	10	42
	ఎస్ఏ ఫిజికల్ సైన్స్	1	2
	ఎస్ఏ సోషల్ స్టడీస్	10	38
	మొత్తం	**41**	**393**
హనుమకొండ జిల్లాలో...	పీఎస్‌హెచ్ఎం(ఎల్ఎఫ్ఎల్)	5	44
	ఎస్ఏ తెలుగు	3	87
	ఎస్ఏ హిందీ	6	88
	ఎస్ఏ ఇంగ్లీష్	4	13
	ఎస్ఏ గణితం	3	31
	ఎస్ఏ ఫిజికల్ సైన్స్	1	7
	ఎస్ఏ బయోసైన్స్	5	40
	ఎస్ఏ సోషల్ స్టడీస్	7	48
	ఎస్ఏ ఉర్దూ	2	0
	ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	8	48
	ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్	0	1
	మొత్తం	**47**	**407**

ఒకే రాష్ట్రంలో రెండు విధానాలు సరికాదు..

డాక్టర్ ఎ. సదయ్య, ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి

ఒకే రాష్ట్రంలో రెండు విధానాలు సరికాదు. మల్టీజోన్-2లో రోస్టర్ పాయింట్ల ఆధారంగా అర్హత కలిగిన ఎల్పీలందరికీ ఉన్నతీకరణకు అవకాశం ఇస్తుంటే మల్టీజోన్-1లో మాత్రం పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. కానీ అందరికీ ఉన్నతీకరణ అవకాశం మాత్రం కల్పించడం లేదు. అధికారులు, ప్రభుత్వం పునరాలోచించి ఎల్పీలందరిని ఉన్నతీకరణ చేయాలి.

అర్హులైన ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలి

పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మన్నె చంద్రయ్య

అర్హులైన ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మన్నె చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ డీఈవో కార్యాలయం ముందు పలువురు ఉపాధ్యాయులతో ఆయన నిరసన వ్యక్తం చేశారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పలువురు ఎల్పీలకు ఉన్నతీకరణకు అవకాశం రాకపోవడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అర్హులైన వారందరికి న్యాయం చేకరూర్చాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రూ.650 కోట్లతో బడ్జెట్?

నేడు బల్దియా ప్రత్యేక సమావేశం ● హాజరు కానున్న మంత్రి, ఎమ్మెల్యేలు


కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్లు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 19: వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం బడ్జెట్ సమావేశం జరుగనుంది. ఈ బడ్జెట్ సమావేశంలో 2024- 2025 సంవత్సరానికిగాను రూ.650కోట్ల నిధుల ప్రతిపాదనలు, అమోదంపై సమీక్ష జరుగనుందని విశ్వసనీయంగా తెలిసింది. అయితే ఈ యేడు ఎన్నికల కోడ్ రావడంతో మూడు మాసాలు గడిచి పోవడం వల్ల 9 నెలలకే ఈ బడ్జెట్ వర్తిస్తుందని చెప్పకొస్తున్నారు. మేయర్ గుండు సుధారాణి నిర్లక్ష్యం వల్లనే ఇప్పటి వరకు ఈ యేడు బడ్జెట్ సమావేశం, ప్రకటనలో జాప్యం జరిగిందని కొందరు కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. అయితే గత 2023-2024 బడ్జెట్‌లో రూ.523కోట్లు ప్రకటించారు. బల్దియాకు వివిధ రకాల ట్యాక్సీలు, భవనాల అద్దెల రూపంలో వచ్చే ఆదాయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు వస్తాయి. సుమారు వంద కోట్ల వరకు బల్దియాకు పన్నుల రూపంలో సొంత ఆదాయం రాగా, మిగతా నిధులు ఎమ్మెల్యే, ఎంపీల్యాడ్స్‌తో పాటు నగర పాలక సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కేటాయిస్తుంది. ఈ నిధులతో సిబ్బంది జీతాలు, విలీన గ్రామాల అభివృద్ధి, శానిటేషన్, లోతట్టు ప్రాంతాల అభివృద్ధి, రోడ్లు, డ్రేనేజీల నిర్మాణం చేపట్టనున్నారు.

మంత్రి, ఎమ్మెల్యేలు హాజరు

బల్దియాలో జరిగే బడ్జెట్ సమావేశానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిలకు బల్దియా నుంచి రెండు రోజుల ముందుగానే ఆహ్వానం పంపించినట్లు తెలిసింది. వీరు సమావేశానికి హాజరై వరంగల్ నగరం అభివృద్ధిపై అంచనాలు, వ్యయంపై చర్చిస్తారు. ప్రధానంగా 66 డివిజన్‌లలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసే ఆలోచనలో మంత్రి, ఎమ్మెల్యేతోపాటు మేయర్ ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

సమావేశంపై నీలినీడలు?

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశం గురువారం బల్దియా కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు జరుగనుంది. ఈ సమావేశం నిర్వహణపై నాలుగు రోజుల ముందుగానే బల్దియా సర్వసభ్య సమావేశంలో సెక్రెటరీ విజయలక్ష్మి ప్రకటించారు. కాగా, రాష్ట్రంలో చాలా మున్సిపాలిటీలలో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ప్రభుత్వ అనుమతితో బడ్జెట్ సమావేశాలు నిర్వహించాయి. శాఖాపరంగా రావలసిన రాబడి, పోబడి గుర్తించి ప్రకటించి అమలు పరిచారు. కానీ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2024-25 బడ్జెట్ ప్రకటించలేదు. అయితే కావాలనే మేయర్ బడ్జెట్ ప్రకటన జాప్యం చేసిందని పాలక వర్గంలోని కొందరు అసంతృప్త వర్గం కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. అయితే గురువారం బల్దియా బడ్జెట్ సమావేశంపై నీలినీడలు అలుముకున్నాయి. అసంతృప్త కార్పొరేటర్లు బల్దియాలో బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరించనున్నట్లు తెలిసింది. ఇదిలా వుండగా, బీఆర్ఎస్ నుంచి మేయర్‌గా గెలిచి కాంగ్రెస్ పార్టీ నుంచి బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనడానికి సుధారాణి అనర్హురాలని వారు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బుధవారం కమిషనర్ అశ్విని తానాజీని కలిసి వినతి పత్రం సమర్పించారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 19: పాలిసెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ ఈ నెల 20 (గురువారం) నుంచి ప్రారంభం కానున్నట్లు పాలిసెట్-2024 వరంగల్ కన్వీనర్ డాక్టర్ బైరి ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 20 నుంచి 24 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్స్ కోసం స్లాట్‌లను బుక్ చేసుకోవాలని తెలిపారు. స్లాట్‌లు బుక్ చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 22 నుంచి 25 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. 22 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుందని, 30న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. 30 నుంచి జూలై 4 వరకు వెబ్‌పోర్టల్ ద్వారా అడ్మిషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పెంపు

హనుమకొండ కలెక్టరేట్, జూన్19: వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ (గుర్తింపుకార్డు) గడువును సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల కోసం రెండేళ్లకోసారి అక్రిడిటేషన్ కార్డుల సదుపాయం రాష్ట్ర సమాచార శాఖ కల్పిస్తుంది. ఆ గడువు ఈ నెల 30వ తేదీతో ముగుస్తుండటంతో గడువు తేదీని 3నెలలు (సెప్టెంబర్ 30వరకు) పొడిగించినట్లు హనుమంతరావు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం

వరంగల్ మెడికల్, జూన్ 19: జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని ఈ నెల 20న నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బిసాంబశివరావు తెలిపారు. 1 నుంచి 19 యేళ్ల వయస్సు గల పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా నులి పురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు ఇప్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ మాత్రలో భోజనం అనంతరం ఇస్తారన్నారు. ఈ మాత్రల వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ఏవైనా కారణాలతో అందుబాటులో లేని పిల్లలకు ఈ నెల 27వ తేదీన మాప్ ఆప్ డే రోజు ఇస్తారన్నారు. హనుమకొండలోని బీఈడీ కాలేజీ పక్కన ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 12.30 గంటలకు ఈకార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు.



ధర్నాలో పెట్రోల్ బాటిల్‌ను చూపుతున్న వ్యక్తి

అనర్హుల ఇళ్ల స్థలాలను రద్దు చేయాలని ధర్నా

- పెట్రోల్ బాటిల్‌తో నిరసనలో పాల్గొన్న వ్యక్తి
- రెవెన్యూ అధికారుల తీరుపై ఆరోపణలు

కేసముద్రం, జూన్ 19 : మహమూద్‌పట్నంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అనర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని, వాటిని వెంటనే రద్దుచేసి, అర్హులైన వారికి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఆ గ్రామానికి చెందిన పలువురు బైఠాయించారు. ఆందోళనకారుల్లో ఒకవ్యక్తి పెట్రోలు సీసాతో ధర్నాలో పాల్గొనడంతో కలకలం రేపింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సర్వేనంబరు 399లో 36 మందికి 100 గజాల చొప్పున ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిందని తెలిపారు. ఇందులో కొందరు ఇళ్లు నిర్మించుకోగా కొంతమంది సగం నిర్మాణం చేసి వదిలేసినట్లు తెలిపారు. తమకు కేటాయించిన ఇళ్ల స్థలాల వద్దకు వెళితే అధికారులు అడ్డుకున్నట్లు ఆరోపించారు. ధర్నా విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ రాములు, ఎస్‌ఐ వంశీధర్ వారి వద్దకు చేరుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అర్హులకు ఇళ్లస్థలాలు అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో నూనావత్ నరేష్, సురేష్, బోడ ప్రకాశ్, వాంకుడోత్ రమేష్, నెహ్రూ, రాంధన్, సత్తు,సువ్వాలి, పాపమ్మ, జానీ, పూలమ్మ, స్వరూప, వనిత, సరోజన పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తొర్రూరు, జూన్ 19 : వడ్డేకొత్తపల్లి 220 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ డీఈ జి.మధుసూదన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలో 20వ తేదీ గురువారం తొర్రూరు, చెర్లపాలెం, ఖానాపురం, నాంచారి మడూర్, పోచంపల్లి, సన్నూరు, ఊకల్ సబ్ స్టేషన్‌ల పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, వడ్డేకొత్తపల్లి, చిన్నవంగర, హరిపిరాల సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇండస్ట్రీలు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. బొమ్మకల్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

23 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

నెల్లికుదురు, జూన్ 19 : అక్రమంగా తరలిస్తున్న 23 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. మహబూబాబాద్ మండలం వీఎస్ లక్ష్మీపురానికి చెందిన సోమయ్య అశోక్‌లేలాండ్ వాహనంలో 23 కింటాళ్ల బియ్యాన్ని తరలిస్తు క్రమంలో నర్సింహులగూడెం స్టేజీ సమీపంలో పట్టుకొని బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్‌చేసి, సోమయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

సీఈవో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలి

నెల్లికుదురు, జూన్ 19 : మహిళా ఉత్పత్తిదారుల సంస్థ తాత్కలిక సీఈవో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలని సెర్ప్ ఏపీఎం వరదయ్య తెలిపారు. సెర్ప్ కార్యలయంలో బుధవారం అయన మాట్లాడుతూ ఈ ఉద్యోగానికి అగ్రికల్చర్ డిగ్రీ, అగ్రికల్చర్ మార్కెటింగ్ అగ్రికల్చర్ బిజినెస్, అగ్రికల్చర్ డిప్లొమా కలిగిన అభ్యర్థులు ఈనెల 24 వరకు నెల్లికుదురు మమూరి మండల సమాఖ్య కార్యలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వ్యక్తి రిమాండ్

మహబూబాబాద్ రూరల్, జూన్ 19 : మహబూబాబాద్ మండలం ముడుపుగల్‌కు చెందిన సంద శేఖర్ ఓ మహిళను వేధిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. ముడుపుగల్ గ్రామానికి చెందిన సంద శేఖర్ గత కొద్దిరోజులుగా అదే గ్రామానికి చెందిన వివాహిత మహిళను వేధించడంతో సదరు మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

'సీకిల్‌సెల్ ఎనిమియా వ్యాధి పట్ల అవగాహన ఉండాలి'

నెహ్రూసెంటర్, జూన్ 19 : ప్రజలందరికి సీకిల్‌సెల్ ఎనిమియా వ్యాధిపట్ల అవగాహన ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖఅధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో) బి.కళావతిబాయి అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ జనరల్ అస్పత్రిలో ప్రపంచ సీకిల్‌సెల్ ఎనిమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీకిల్‌సెల్ వ్యాధిపట్ల అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు, ప్రైవేట్ వైద్యులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎర్రయ్య, మహబూబాబాద్ మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, జిల్లా ప్రభుత్వ జనరల్ అస్పత్రి ఇన్‌చార్జ్ సూపరిండెంట్ డాక్టర్ జగదీష్, అంబరీష, సుధీర్ రెడ్డి, సత్యవతి, కృష్ణార్జున్‌రావు, మహేందర్, విజయ, పురుషోత్తం, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

మహబూబాబాద్ టౌన్, జూన్ 19 : జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర జాయింట్ కో-ఆర్డినేటర్ పింగ్రాల రాందాసు ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఆయన జన్మదిన కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాందాసు మాట్లాడుతూ దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం ఎంతో అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుంజె హన్మంతు, రాజమ్మ, చిరంజీవి, శివ యాదవ్, కిషన్, స్వరూప, చిత్తారి సోమన్న, యాకన్న పాల్గొన్నారు.



మానుకోటలో కేక్‌ను కట్ చేస్తున్న రాందాసు

వివిధ మండలాల్లో..

దంతాలపల్లిలో రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పొన్నోటి బాలాజీ, నవీన్‌రెడ్డి, కోట్య, రవీందర్‌నాయక్, భద్రునాయక్ పాల్గొన్నారు.

- పెద్దవంగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముద్దసాని సురేష్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు దాసరి శ్రీనివాస్, సీతారాంనాయక్, శ్రీనివాస్, మహేష్, ముత్తినేని శ్రీనివాస్, వినోద్, ఉప్పలయ్య, లింగమూర్తి, వెంకన్న, సంతోష్, సమ్మయ్య పాల్గొన్నారు.
- తొర్రూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. పట్టణాధ్యక్షుడు సోమ రాజశేఖర్, సంతోష్, రాంచంద్రయ్య, సురేందర్‌రెడ్డి, బి.అనిల్, శ్రీనివాస్, వెంకన్న, శంకర్ పాల్గొన్నారు.
- డోర్నకల్ మెయిన్‌రోడ్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు కాల సుమీర్ చంద్‌జైన్, మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, మునిసిపల్ కౌన్సిలర్ బసిక అశోక్, నాయకులు నలబోలు శ్రీనివాస్, ధరావత్ కృష్ణ, మాలోతు వీరన్న, సుశీల్‌కుమార్‌జైన్, నాని, రెడ్డబోయిన శంకర్, రాహుల్, వాజీద్, ఖాసీం, సకినాల వెంకన్న పాల్గొన్నారు.
- గార్లలో రాహుల్‌గాంధీ జన్మదిన కేక్‌ను కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి కృష్ణగౌడ్ కట్‌చేసి పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాలోతు వెంకట్‌లాల్, జడ్పీటీసీ జాటోతు ఝాన్సీలక్ష్మి, వెంకట్‌రెడ్డి, డాక్టర్ రాజ్‌కుమార్‌జాదవ్, శంషాద్‌బేగం పాల్గొన్నారు.
- కొత్తగూడలో కేక్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య కట్ చేసి పంపిణీ చేశారు. చల్లా నారాయణరెడ్డి, సుంకరబోయిన మొగిలి, రూప్‌సింగ్, బిట్ల శ్రీను, కాడబోయిన జంపయ్య, సిరిగిరి సురేష్, వేణు, సురేష్ పాల్గొన్నారు.
- నెల్లికుదురులో రాహుల్‌గాంధీ జన్మదిన కేక్‌ను కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్‌గౌడ్ కట్ చేశారు. హెచ్.వెంకటేశ్వర్లు, కాసం లక్ష్మారెడ్డి, మౌనేందర్, బాలాజీనాయక్, రత్నపురం యాకయ్య, జల్లె వెంకటేష్ పాల్గొన్నారు.
- కేసముద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. ఎండీ అయూబ్‌ఖాన్, రావుల మురళి, అల్లం గణేష్, విజేందర్‌రెడ్డి, రఫీఖాన్, బాలు, రషీద్, ఎండి.నవాజ్, సుమన్ పాల్గొన్నారు.
- గూడూరులో రాహుల్‌గాంధీ జన్మదిన కేక్‌లను మండల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేర్వేరుగా కట్ చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. శ్రీపాల్‌రెడ్డి, బొల్లికొండ మధు, వాంకుడోతు కొమ్మాలు, బోయినపల్లి సతీష్‌రావు, ఏపూరు రవీందర్‌రెడ్డి, కన్నబోయిన వెంకన్న, పెసరి శివ, హెచ్.శివ పాల్గొన్నారు.
- కురవిలో రాహుల్‌గాంధీ జన్మదిన కేక్‌ను మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం కట్‌చేసి, పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కొర్ని రవీందర్‌రెడ్డి, బాదావత్ రామునాయక్, ఎన్.రాజేందర్‌కుమార్, అవిరె మోహన్‌రావు, గొల్లపల్లి రజినీకాంత్, చిన్నం గణేష్, దొంగల జనార్ధన్‌రెడ్డి, సక్రు, బెడద కృష్ణమూర్తి, మిర్యాల లక్ష్మయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరేది లేదు : ఎర్రబెల్లి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరి, జూన్ 19 : బీఆర్‌ఎస్ పార్టీని వీడేది లేదని, కాంగ్రెస్ పార్టీలో చేరేది లేదని మాజీ మంత్రిఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. బుధవారం ఆయన పర్వతగిరి మండలకేంద్రంలోని తన నివాసంలో పాలకుర్తి నియోజకవర్గ ముఖ్యనాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను పార్టీ మారుతున్నానని కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు కావాలని పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తు న్నారని మండిపడ్డారు. అమలుకాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, హామీలు నెరవేర్చలేక ప్రభు త్వం బొక్కబోర్లా పడుతోందని అన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో దూసుకుపోయిందని, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన మాయమాటలు నమ్మి ప్రజలు గెలిపించారని, కానీ త్వరగానే వారికి తాము చేసిన తప్పేంటో అర్థమైందని అన్నారు. కేవలం బీఆర్‌ఎస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఇటీవల వెల్లడైన లోక్‌సభ, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఫలితాలపై ఆయా ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలోని మండలాల వారీగా పోలైన ఓట్లు, ఓట్లశాతంపై ఆరా తీశారు. ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకూడదని సూచించారు. తనకు అండగా నిలిచిన ప్రతీ కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని భరోసా ఇచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ పూర్వవైభవం సంతరించుకుంటుందని, నాయకులు, కార్యకర్తలు కష్టపడి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు.

ట్రాక్టర్ కిందపడి చిన్నారి మృతి



మోహనశ్రీ (ఫైల్)

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జూన్ 19 : ఇంటివద్ద ఆడుకుంటూ.. బయటకు వెళ్లిన ఓ చిన్నారి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మట్టేవాడలో బుధవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. మట్టేవాడ గ్రామానికి చెందిన మేడ జయంత్ కుమార్తె మోహనశ్రీ (3) ఇంటివద్ద ఆడుకుంటోంది. ఈ క్రమంలో చిన్నారి ఇంటిపక్కన ఆగివున్న ట్రాక్టర్ సమీపంలోకి వెళ్లింది. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ముందుకు కదలడంతో దానికిందపడి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం చిన్నారిని మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ మోహనశ్రీ మృతి చెందినట్లు తెలిపారు. కాగా, ఈ ఘటనపై కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

(3వ పేజీ తరువాయి)

ప్రకారం. అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గుడుంబా స్థావరాలపై 70 మంది అధికారులు, సిబ్బంది దాడులు చేపట్టారు. గుడుంబాను స్వాధీనం చేసుకుని గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. మహబూబాబాద్ సబ్ డివిజన్‌లోని 10 పోలీస్‌స్టేషన్ పరిధిలో 8 కేసులు నమోదు చేసి 78 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని 1130 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. తొర్రూరు సబ్‌డివిజన్‌లోని 8 పోలీస్‌స్టేషన్లలో పరిధిలో 4 కేసులు నమోదు చేసి, 65 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని 800 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు.

గుడుంబా తయారీ చేసినా, విక్రయించినా కేసులు..

జిల్లాలో గుడుంబా స్థావరాలకు చోటులేదని, ఎవరైనా అక్రమంగా గుడుంబాను తయారీ చేసిన, విక్రయించిన చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ హెచ్చరించారు. గుడుంబా తయారీ చేస్తే బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. గుడుంబాకు అలవాటు పడిప్రాణాలు కోల్పోవడం వల్ల ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతూన్నాయని చెప్పారు. ఎక్కడైనా గుడుంబా తయారీ చేసినా, అమ్మినా సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

కటకటాల్లోకి కామ ఖాకీ!

(3వ పేజీ తరువాయి)

సమగ్ర నివేదికను పంపగా భవానిసేన్‌పై వేటు పడింది.

రేప్ కేసు

లైంగిక వేధింపులు నిజమేనని తెలిసిన వెంటనే ఆ ఎస్సై వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌ను జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే బాధితురాలి ఫిర్యాదుతో తాను విధులు నిర్వర్తించిన కాళేశ్వరం ఠాణాలోనే భవానిసేన్‌పై ఐపీసీ 449,376(2)324, 506 సెక్షన్ల కింద రేప్‌కేసు నమోదు చేశారు. అనంతరం మహదేవపూర్ ఎస్సై పవన్, సీసీఎస్ సీఐ రవిందర్ నేతృత్వంలో ఆయన్ను భూపాలపల్లి ఫస్ట్ క్లాస్ అడిషనల్ కోర్టులో బుధవారం రిమాండ్‌కు తరలించారు. మరోవైపు ఆయనను విధుల నుంచి పూర్తిగా తొలగించినట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

గతంలోనూ..

ఎస్సై భవానిసేన్‌గౌడ్ గతంలోనూ ఓ యువతిని వేధింపులకు గురి చేయడంతో సస్పెండ్ అయ్యారు. 2022, జూలై 12న ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన ఎస్సైగా పనిచేస్తున్న సమయంలో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి సిద్ధమవుతున్న ఓ యువతిని సాయం పేరుతో మభ్యపెట్టి పోలీస్‌స్టేషన్‌కు రప్పించుకొని పలుసార్లు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. అప్పట్లో ఈ వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ప్రముఖంగా ప్రచురించి వెలుగులోకి తెచ్చింది. దీంతో స్పందించిన అధికారులు విచారణ జరిపి భవానీసేన్‌ను సస్పెండ్ చేశారు. అయితే, రాజకీయ పలుకుబడి పోలీసు ఉన్నతాధికారుల్లో తనకున్న పరిచయాలను ఆధారంగా చేసుకొని కేవలం మూడునెలల వ్యవధిలో తిరిగి పోస్టింగ్ సంపాదించుకున్నాడు. తదుపరి జిల్లాలోని మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఠాణా ఎస్సైగా 16 ఫిబ్రవరి, 2024న మళ్లీ ఆయన పోస్టింగ్ పొందాడు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు సెప్టెంబరు 30 వరకు పెంపు

మహబూబాబాద్ టౌన్, జూన్ 19 : రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డు గడువును మరో మూడునెలలు సెప్టెంబరు 30 వరకు పొడిగించినట్లు రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్లు అయిన జిల్లా కలెక్టరు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల కోసం ప్రతీరెండు సంవత్సరాల కొకసారి అక్రిడిటేషన్ కార్డుల సదుపాయం రాష్ట్ర సమాచారశాఖ కల్పిస్తోందని చెప్పారు. ఆ గడువు జూన్ 30తో ముగుస్తుండగా దానిని సెప్టెంబరు 30 వరకు పొడిగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నీట్‌పై ప్రధాని మోదీ మౌనం ఎందుకు?

మహబూబాబాద్ టౌన్, జూన్ 19 : జాతీయ అర్హత పరీక్ష నీట్ అవకతవకలపై ప్రధాని మోదీ మౌనం ఎందుకు దాల్చుతున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి ప్రశ్నించారు. నీట్ అవకతవకలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, చింతకుంట్ల వెంకన్న, బానోత్ లింగ్యా, జలగం ప్రవీణ్, మహమూద్, అశోక్, వెంకటేష్, శంకర్, శ్యాంప్రసాద్, రమేష్ శ్రీనాధ్, నక్క నాగార్జున, సత్యం, మల్లయ్య కుమార్, కార్తీక్, హర్షవర్ధన్, వికాస్, సాయి, రవి, రమేష్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

రూ.లక్ష చొప్పున జరిమానా

తీర్పును వెల్లడించిన మహబూబాబాద్ ప్రధాన జిల్లా జడ్జి

కేసముద్రం, జూన్ 19 : కేసముద్రం మండలం కల్వల శివారులో గంజాయిని తరలిస్తూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు బుధవారం పదేళ్ల జైలు శిక్షను విధిస్తూ మహబూబాబాద్ ప్రధాన జిల్లా జడ్జి చంద్రశేఖరప్రసాద్ తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ వంశీధర్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన ప్రకారం. 2022, మార్చి 9న వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికొండకు చెందిన గుగులోత్ నిజ్జు, కేసముద్రం మండలం బోడమంచ్యా తండాకు చెందిన భూక్య చంటి బైక్‌పై రెండు బస్తాల్లో 17.1కిలోల గంజాయిని తరలిస్తున్నారు. అదే రోజున కల్వలశివారు ఆలేరుకు వెళ్లే మార్గంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా గంజాయితో సహా నిందితులు పట్టుబడ్డారు. అప్పటి ఎస్‌ఐ తిరుపతి కేసు నమోదు చేయగా రూరల్ సీఐ రవికుమార్ విచారణ చేపట్టి చార్జ్‌షీట్ వేశారు. ప్రస్తుత రూరల్ సీఐ సర్వయ్య ఆధ్వర్యంలో ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలుకమారి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. వాదోపవాదాలు విన్న అనంతరం ఈ కేసులో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ ప్రధాన జిల్లా జడ్జి చంద్రశేఖర ప్రసాద్ తీర్పు వెలువరించారు. సాక్షులను ప్రవేశపెట్టి నిందితులకు శిక్షపడే విధంగా ప్రతిభ కనబర్చిన కోర్టు డ్యూటీ ఆఫీసర్ దేవ, పోలీసు అధికారులను మహబూబాబాద్ ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అభినందించినట్లు ఎస్‌ఐ వంశీధర్ తెలిపారు.

ఈదులపూసపల్లి దర్గాలో ఘనంగా ఉర్సు ఉత్సవం

మహబూబాబాద్ టౌన్, జూన్ 19 : జిల్లా కేంద్రం శివారు ఈదులపూసపల్లిలోని ఇమాంషావలి దర్గాలోఉర్సు ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముస్లీంలు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాలో ప్రతీ శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఏటా బక్రీద్ పండుగ జరుపుకున్న రోజు నుంచి మూడోరోజు దర్గాలో ఉర్సు ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది బక్రీద్ పండుగ అనంతరం బుధవారం ఉర్సును నిర్వహించారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఈదులపూసపల్లి గ్రామం దర్గా ముతవల్లి షేక్.అన్వర్‌పాషా ఇంటి నుంచి సందల్- కందిల్ బయలుదేరి మానుకోట తహసీల్ ఆఫీస్‌కు చేరుకుంది. అక్కడ్నుంచి రాత్రి పొద్దుపోయాక పకీర్‌లా విన్యాసాలు, బ్యాండ్ మేళాలతో అధికారికంగా బయలుదేరిన సందల్, కందిల్ ప్రదర్శన బుధవారం తెల్లవారుజామున ఈదులపూసపల్లి దర్గాకు చేరుకుంది. సాయంత్రం వరకు ముస్లీంలు తరలివచ్చి ఉర్సులో పాల్గొని చాదర్‌లు సమర్పించి ప్రార్థనలు చేశారు. మాజీఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ప్రత్యేక ప్రార్థనలు చేసి చాదర్‌ను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లూనావత్ అశోక్‌నాయక్ పాల్గొన్నారు. స్థానిక మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి చాదర్‌ను సమర్పించి ప్రార్థనలు చేశారు. ఆయన వెంట వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, డౌలాగర్ శంకర్ ఉన్నారు.



దర్గాలో ప్రత్యేక ప్రార్థన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

'ఉపా కేసును ఎత్తివేయాలి'

మహబూబాబాద్ టౌన్, జూన్ 19 : భారతదేశం గర్వించదగ్గ ప్రఖ్యాత రచయిత అరుంధతిరాయ్, ప్రొఫెసర్ షేక్, సంకత్ హుస్సేన్‌పై కేంద్రప్రభుత్వం పెట్టిన ఉపా కేసును ఎత్తివేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ సర్కార్ 2010లో నమోదైన తప్పుడు కేసును తిరగతోడి విచారణకు ఆదేశించడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, జిల్లా నాయకులు పూనం ప్రభాకర్, జగ్గన్న, వీరన్న, సూర్యం పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీలకు జరిగిన అన్యాయన్ని సరిదిద్దాలి'

మహబూబాబాద్ టౌన్, జూన్ 9 : విద్యాశాఖ పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ పీహెచ్‌సీ ఉపాధ్యాయులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ ఈరునాయక్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం విజ్ఞప్తి చేవారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో జిల్లా విద్యాశాఖాధికారి రామారావుకు బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఆయా సంఘాల నాయకులు కొడెం రజిత, నిర్మల, మాలోతు శివనాయక్, రంగన్న, భోజ్యా మాలోతు బద్రి, శ్రీను పాల్గొన్నారు.

సామగ్రిని చోరీ లేయలేదంటూ ఠాణాలో ఫిర్యాదు

దంతాలపల్లి, జూన్19 : మండల కేంద్రం శివారు శ్రీకనకదుర్గ మోడ్రన్ రారైస్ మిల్ సామగ్రిని దొంగలించలేదంటూ తొర్రూరుకు చెందిన వనమాల నాగేశ్వర్‌రావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ తాను మండలంలోని తూర్పుతండాకు చెందిన గుగులోతు నాగమణికి చెందిన రెండురైస్ మిల్లులు 20 సంవత్సరాల పాటు (2024వరకు) లీజుకు తీసుకున్నానన్నారు. ఈ లీజు మహబూబాబాద్ రిజిష్టర్ కార్యాలయంలో తన పేరిట మార్చి నెలలో అయిందన్నారు. శ్రీకనకదుర్గ మోడ్రన్ రా రైస్ మిల్లులో మిషన్లు పాడైపోవడంతో ఏప్రిల్ మాసంలో నూతన మిషనరికై పాత మిషన్లను తరలించానన్నారు. తనపై పోలీస్‌స్టేషన్‌లో నాగమణి ఫిర్యాదు చేయడంతో ఆధారాలతో తాను కూడా ఫిర్యాదు చేశానన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు

కొత్తగూడ, జూన్ 19 : బస్సు, ద్విచక్రవాహనం ఢీకొనగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కొత్తగూడ-చిలకమ్మనగర్ గ్రామాల మధ్యలోని గువ్వలబోడు వద్ద బుధవారం జరిగింది. వివరాల ప్రకారం. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం చిలకమ్మనగర్ గ్రామానికి చెందిన జర్పుల సుమన్, అజ్మీరా అనిల్ చిలకమ్మనగర్ నుంచి కొత్తగూడకు వస్తున్నారు. నర్సంపేట డిపోకు చెందిన బస్సు ముస్మి నుంచి నర్సంపేటకు వెళుతుంది. కొత్తగూడ దాటిన తరువాత గువ్వలబోడు వద్ద బస్సు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. జర్పుల సుమన్, అజ్మీరా అనిల్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108లో నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

ఆకస్మిక తనిఖీ

తొర్రూరు, జూన్ 19 : తొర్రూరు డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న 108 వాహనాలను జిల్లా అధికారి మహేష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వాహనంలో ఉండే పరికరాలు, అత్యవసర సమయాల్లో ప్రజలకు అందుతున్న సేవలు తదితర అంశాలను అడిగి తెలుసుకుని సిబ్బందికి తగు సూచనలు చేశారు. ప్రజలకు 108 వాహనం ద్వారా మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది నవీన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బిర్యానీ సెంటర్‌లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ల తనిఖీ

- తొర్రూరులో ఐదు బిర్యానీ సెంటర్‌లకు నోటీసులు

తొర్రూరు, జూన్ 19 : బిర్యానీ సెంటర్‌లు, హోటళ్లు ప్రజలకు కల్తీ ఆహారాన్ని అందిస్తే వారిపై చర్యలు తప్పవని, కేసులు నమోదు చేస్తామని జిల్లా ఇన్‌చార్జి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పి.రోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో బిర్యానీ సెంటర్‌లు, హోటళ్లను తనిఖీచేసి నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆహార పదార్థాలు కల్తీ అవుతున్నాయని, బిర్యానీ సెంటర్‌లలో వండిన బిర్యానీని చెత్తట్రాక్టర్‌లలో పడేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిర్యానీ సెంటర్‌ల నిర్వాహకులు ఇష్టానుసారంగా కల్తీ చేస్తున్నారని వారిపై చర్యలుంటాయని తెలిపారు. అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేస్తుండటంతో సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో విద్యార్థులకు సరఫరా చేస్తున్న కిరాణా స్టోర్‌ను తనిఖీ చేసి శాంపిల్స్ సేకరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై నాసిరకం సరుకులు అందజేస్తున్నారని, వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మొత్తం 30 బిర్యానీ సెంటర్‌లు, హోటళ్లు తనిఖీ చేసి ఐదు బిర్యానీ సెంటర్‌లకు నోటీసులు అందజేశామన్నారు. జిల్లా వినియోగదారుల సమాఖ్య ఇన్‌చార్జ్ వి.సుధాకర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కుక్కల తీవ్రతను అరికట్టాలి

- ఎంపీడీవో సిలార్ సాహెబ్ • 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

తొర్రూరు రూరల్, జూన్ 19 : గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉండటంతో తక్షణమే కుక్కల తీవ్రతను అరికట్టాలని ఎంపీడీవో సిలార్ సాహెబ్ అన్నారు. ఈనెల 19న ఆంధ్రజ్యోతిలో 'గ్రామాల్లో భౌ భయం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మండల అధికారులు స్పందించారు. ఈ మేరకు తొర్రూరు ఎంపీడీవో సిలార్ సాహెబ్ గ్రామాల్లోని కుక్కలను పట్టి దూర ప్రాంతాల్లో వదలి రాలవంటూ బుధవారం సర్క్యూలర్ జారీ చేసి మాట్లాడుతూ మడిపల్లి గ్రామంలో 42 రోజుల బాలుడుపై జరిగిన కుక్కల దాడిలో బాలుడు చనిపోవడం దురదృష్టకమన్నారు.

గామాల్లో కుక్కల తీవ్రత అధికంగా ఉండటంతో జీపీ నిధులతో తక్షణమే కుక్కలను పట్టి దూరప్రాంతాల్లో వదిలేసి రావాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో ఆదేశించారు.